విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 20, మే 2024

నమ్మారు.. కట్టారు.. నట్టేట మునిగారు

- రూ.3.48 లక్షల స్వాహా చేసిన తపాలా నిర్వహణాధికారి
- ఆందోళన చెందుతున్న బాధితులు

విశాలాంధ్ర -రుద్రవరం: కాయ కష్టం చేసుకుంటూ తమ పిల్లలను ఆరోగ్యపరంగా చూసకుంటూ, విద్యలో ఉన్నత చదువులను చదివించుకోవాలన్న ఆశతో తమ కష్టంలో కొంత సొమ్మును గ్రామంలోని పోస్ట్ ఆఫీస్‌లో ప్రతి నెలకు కొంత డబ్బును డిపాజిట్ చేసుకుంటే వారికి లక్షల రూపాయల డిపాజిట్ డబ్బులను స్వాహా చేసి గ్రామస్తులకు కనపడకుండా తపాలా శాఖ అధికారి మొహం చాటేసిన నిర్వాకం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలోని ఉప తపాలలో బ్రాంచ్ క్లస్టర్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అధికారి గ్రామానికి చెందిన వందల మంది తమ కష్టంలోని కొంత డబ్బును నెలకు కొంతమంది రూ.200, కొంతమంది రూ.500 పోస్ట్ ఆఫీస్‌లో డిపాజిట్ చేశారు. ఇటీవల కొన్ని రోజుల క్రితానికి డిపాజిట్ పూర్తి చేసుకున్న వారు తమ డబ్బును ఇవ్వమని అడిగితే సంబంధిత అధికారి గ్రామస్తులకు సరైన సమాధానం చెప్పక ముఖం చాటేసాడు అంటున్నారు గ్రామస్తులు. గ్రామస్తులు వెంకట లక్ష్మమ్మ, వెంకట సుబ్బయ్య, గోవిందమ్మ పలువురు తెలిపిన వివరాల మేరకు శ్రీరంగాపురం గ్రామానికి చెందిన దాదాపు 62 మంది పోస్ట్ ఆఫీస్‌లో మేము దాచిన లక్షల రూపాయలను పోస్ట్ ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారి డిపాజిట్ కట్టినా మా బుక్కులను మాకు ఇవ్వకుండా నా దగ్గరే ఇక్కడే ఉన్నాయంటూ మమ్మలను

నమ్మించి మా డబ్బంతా తీసుకొని మమ్మలను మోసం చేశాడు మా డబ్బు మాకు తిరిగి ఇవ్వాలని అడిగితే ఇప్పుడు ఇస్తాను వస్తున్నాను అంటూ మాయ మాటలు చెప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. ఒక్క శ్రీరంగాపురంలోనే రూ.3.48 లక్షలు మోసం చేశాడంటే మిగిలిన గ్రామాలైన ఢీ కొట్టాల, టీ కొట్టాల గ్రామాలకు చెందిన డబ్బును ఎంత స్వాహా చేశాడో అర్థం కావడం లేదు అంటున్నారు. కాయ కష్టం చేసుకుంటూ మేము నమ్మి పోస్ట్ ఆఫీస్‌లో నెలకు కొంత డబ్బును డిపాజిట్ చేస్తే మమ్ములను నట్టేట ముంచి మా డబ్బులను కాజేసిన పోస్ట్ ఆఫీస్ అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని విచారించి మా డబ్బు మాకు వచ్చేలాగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టిడ్కో గృహ సముదాయంలో పోలీసుల సోదాలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున పట్టణ శివారులోని టిడ్కో గృహ సముదాయంలో డీఎస్పీ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. 5 మంది సీఐలు, 6 మంది ఎస్సైలు, 40 మంది ఆళ్లగడ్డ సబ్ డివిజనల్ పోలీసు సిబ్బంది మరియు 30 మంది స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి కార్డెన్ సర్చ్ నిర్వహించి టిడ్కో ఇండ్లలో ఉన్న వారి వివరాలు సేకరించి, సదరు ఇండ్ల యందు కొత్తవారు ఎవరైనా ఉన్నారా అని సమాచారం సేకరించి, కాలనీలో ఉన్న వాహనాలను వాటి రికార్డ్సను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కాలనీలో ప్రజల చేత మీటింగ్ ఏర్పాటు చేసి కాలనీలోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉంటే వెంటనే పోలీసు వారికి సమాచారం అందజేయాలని ఏదైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయుచున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందజేయాలన్నారు.

త్వరలోనే కాలనీ నందు పోలీస్ పికెట్టు ఏర్పాటు చేస్తామని కాలనీ ప్రజలకు డీఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్డెన్ సెర్చ్ తెల్లవారు జామున 5 గంటల నుండి ఉదయం 7 గంటల వరకు నిర్వహించారు. టౌన్ సీఐ రమేష్ బాబు, రూరల్ సీఐ హనుమంత నాయక్, సిరివెళ్ల సీఐ చంద్రబాబు, జయచంద్ర, టౌన్ ఎస్సైలు నగిన, వెంకటరెడ్డి, రూరల్ ఎస్ఐ నరసింహులు, ఉయ్యాలవాడ ఎస్సై రామాంజనేయ రెడ్డి, సిరివెళ్ల ఎస్ఐ సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర - చాగల మర్రి : మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో వెళ్ళాలలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమ లింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 25న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ జగదీశ్వరరెడ్డి తెలిపారు. దాతల సహకారంతో బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వృషభ రాజములకు మొదటి బహుమతి రూ.1.10 లక్షలు, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాల్గవ బహుమతి రూ.30 వేలు, ఐదో బహు మతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

24న ఆలయ భూములకు వేలం పాట

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని రామలింగేశ్వర, లక్ష్మీ చెన్నకేశవ ఆలయాలకు సంబంధించిన భూములకు ఈనెల 24న కౌలుకు ఇచ్చుటకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఈవో సాయి జయచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చెన్నకేశవ ఆలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 34.66 ఎక రాల భూములకు, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన 15.51 ఎకరాల భూములను కౌలుకు ఇవ్వడానికి వేలం పాటలు నిర్వహి స్తున్నామని అన్నారు. పాటదారులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. 2024 నుంచి 2027 వరకు కౌలు హక్కు కల్పించనున్నట్లు చెప్పారు.

ఘనంగా నీలం సంజీవ రెడ్డి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణంలోని 6వ వార్డ్ జగజ్జనని నగర్‌లో ఉన్న డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమర యోధుడు నీలం సంజీవరెడ్డి చిత్ర పటానికి వ్యవస్థాపక అధ్యక్షులు డీపీ మస్తాన్‌వలి పూలమాల వేసి ఆయన 111 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, భారత రాష్ట్రపతిగా, లోక్ సభ స్పీకర్‌గా, కేంద్ర మంత్రిగా, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నో ఉన్నతమైన పదవులను అలంకరించారన్నారు. ఎన్నో ఉన్నత పదవులు అలంకరించినా ఏలాంటి హంగు ఆర్భాటాలకు లోను కాకుండా ప్రజల మన్నలను పొందిన రాయలసీమ ఆణిముత్యం మన నీలం సంజీవరెడ్డి అని, ఇలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సేవలను కొనియాడారు. ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, సలహాదారులు నబి రసూల్, సభ్యులు ఆరిఫ్, ముస్తఫా పాల్గొన్నారు.

పేదల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: మండల కేంద్రంలో ఆదివారం ప్రొఫెషనల్ కొరియర్ ఆఫీసు నందు సీపీఎం దక్షిణాది రాష్ట్రాల ఉద్యమ నేత, పేదల పక్షపాతి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఎం నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు ఎం.సుధాకర్ మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 1913లో నెల్లూరు జిల్లాలోని అలగానిపాడులో జన్మించారు. స్వాతంత్ర ఉద్యమంలో మరియు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడటం జరిగింది. చట్టసభలలో సామాన్య జీవితం గడుపుతూ జీవించారు. పార్లమెంటుకు వెళ్లే సందర్భంగా సైకిల్ పైనే ఆయన ప్రయాణం కొనసాగిందన్నారు. ఆయన చట్టసభలలో ఏమి మాట్లాడినా అది రైతుల కోసం, కార్మికుల కోసం, కర్షకుల కోసం, వెనుకబడిన పేదల కోసం, మాట్లాడిన వ్యక్తి అని ఆయన అన్నారు. ఇలాంటి మహనీయుని 39 వ వర్ధంతి సందర్భంగా స్ఫూర్తిగా తీసుకొని హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అల్లావుద్దీన్, మద్దిలేటి, దిబ్బరాజు, రవికుమార్‌లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామంలో బోయ కుమారస్వామి (38) అనారోగ్యంతో మృతి చెందారు. బోయ కుమారస్వామి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వైసీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇంచార్జీ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ నాయకులు నూనెపలే ఎల్లారెడ్డి ఆదివారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నూనెపల్లె ఎల్లారెడ్డి మాట్లాడుతూ మృతుని కుటుంబ సభ్యులకు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యువసేన ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ఆయన భరోసాని ఇచ్చారు. మృతుని కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నునెపల్లె నాగిరెడ్డి, నూనేపల్లె రమణారెడ్డి, తెలుగు సాంబ, అంజి, రాజేష్, దర్గయ్య, శ్రీను, బాలు, వడ్డే శంకర్, తెలుగు శ్రీను, వడ్డే నాగ శేషులు పాల్గొన్నారు.

వైసీపీదే విజయం : గంగుల

విశాలాంధ్ర - చాగలమర్రి : ఆళ్లగడ్డ అసెంబ్లీ స్థానాన్ని వైసీపీ అభ్యర్థి గంగుల విజేంద్రారెడ్డి భారీ మెజారీటీతో గెలుపొందుతున్నాడని, రాష్ట్రంలో జూన్ 9న వైఎస్ జగన్మోహన్రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారని జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం చాగలమర్రిలోని కెజిఎన్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్రెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 13వ తేదిన జరిగిన ఎన్నికలలో ప్రజలు అధిక శాతం వైసీపీవైపు నిలబడి ఓట్లు వేసి ఆదరించారన్నారు. రాష్ట్రంలో మరోక్కసారి వైసీపీ సునామి సృష్టించబోతున్నదని అన్నారు. దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోని అధికారాన్ని దక్కించుకోవాలని ప్రయత్నించిన చంద్రబాబునాయుడుకు, టిడిపికి ఈ ఎన్నికలలో ప్రజలు ఓట్లతో బుద్ధి చెపపబోతున్నారన్నారు. ఓటమి భయంతో టీడీపీ రాష్ట్రంలో మారణహెూమాన్ని సృష్టిస్తున్నదని దానికి ఉదాహరణ పల్నాడులో జరుగుతున్న హింసాకాండ అన్నారు. ఏది ఏమైనా రాష్ట్ర ప్రజలు మరోక్కసారి జగనన్నకే పట్టం కట్టనున్నారన్నారు. వ్యవస్థలను మ్యానేజ్ చేసే అలవాటున్న చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు కొంతమంది ఐఎఎస్, ఐపీఎస్ అధికారులను బదిలి చేయించి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవదళ్ కార్యదర్శి వెంకటరమణ, మండల కో-ఆప్షన్ సభ్యుడు జి.ఇబ్రహీం, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, ఎంపీటీసి సభ్యుడు పత్తినారాయణ, సర్పంచ్ గోవిందయ్య, మైనారిటీ నాయకుడు ముల్లా ఖాజాహుసెన్, పగిడాల బాబు, శ్రీనివాసులు గౌడ్, చక్రపాణి గౌడ్, సంజీవరాయుడు, రమణారెడ్డి, రహీమాన్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి ఆస్తిలో వాటా అడిగితే చిత్రహింసలు పెట్టిన సొంత సోదరులు

విశాలాంధ్ర - నందికొట్కూరు : తన తండ్రి ఆస్తిలో వాటా ఇవ్వమని అడిగితే తన సోదరులు, తన తండ్రి తనపై దాడికి పాల్పడి చిత్రహింసలు పెట్టడం జరిగిందని బాధితుడి జక్రియ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు జక్రియ మూడో కుమారుడు న్యాయతుల్లా పోలీస్ అధికారులను ఆదివారం వేడుకున్నారు. వివరాల మేరకు నందికొట్కూరు నియోజవర్గ పరిధిలోని మిడుతూరు మండలం దేవనూరు గ్రామానికి చెందిన జక్రియకు ముగ్గురు కుమారులు. వీరిలో మొదటి కుమారుడు మూర్తుజావాలి, రెండో కుమారుడు అల్తాఫ్ అహ్మద్, మూడో కుమారుడు న్యాయతుల్లా జక్రియ ఆస్తి పంపకంలో ఇద్దరు కుమారులు మూర్తు జవాలి, అల్తాఫ్ అహ్మద్ లకు తండ్రి ఆస్తిలో వాటాను పొందడం జరిగినది. తన తండ్రి ఆస్తిలో వాటా రాని మూడో కుమారుడు న్యాయతుల్లా తనకు తన తండ్రి

ఆస్తిలో వాటకావాలని అడగగా కుమారులు లేరని, కూతురు మాత్రమే ఉందని, నీకు ఆస్తి ఇవ్వడం కుదరదని సొంత సోదరులు తనపై దాడికి పాల్పడి చంపాలని ప్రయత్నించారని బాధితులు న్యాయతుల్లా కుటుంబ సభ్యులు ఆదివారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరగనందున తన తండ్రి ఆస్తిలో వాటా పొందుటకు కోర్టును ఆశ్రయించడం జరిగిందని, దాని మనసులో ఉంచుకొని తనపై కక్ష సాధింపు చర్యలకు తన సోదరులైన మూర్తుజావలి, అతని భార్య, అల్తాఫ్ అహ్మద్, రఫీ, షఫీ లు అందరూ కలిసి నా ఇంటికి గల కరెంటు కనెక్షన్ తీసివేయడమే కాకుండా, ఇంటిని అమ్మి వేయటకు సిద్ధపడ్డారన్నారు. ఇదే సందర్భంలో అందరూ కలిసి తనను, తన భార్యను విచక్షణ రహితంగా కొట్టి, గొంతు నిలిమి, పెట్రోల్ పోసి చంపడానికి ప్రయత్నించారని బాధితుడు న్యాయతుల్లా వాపోయారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు, తన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని, వారిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని అధికారులను కోరారు.

స్ట్రాంగ్ రూముల వద్ద నిత్యం అప్రమత్తం

విశాలాంధ్ర - నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆర్జీయం, శాంతిరామ్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద అత్యంత పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిలు అన్నారు. ఆదివారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎం బాక్స్‌లను భద్రపరచిన ఆర్జీయం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టిన భద్రతా పరిస్థితులను గమనించారు. తలుపులకు వేసిన తాళాలు, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని స్ట్రాంగ్ రూంలు సీసీ కెమెరాలతో కనెక్ట్ చేయబడి వెబ్ కాస్ట్ అవుతున్న దృశ్యాలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో వారు సంతకాలు చేశారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశించకుండా కట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని విధాలుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసేవరకు ఆర్జీయం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా హింసాత్మకమైన ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలలో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని పిడిఎస్యు ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఏపీటీఎఫ్ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటనలు చేసిన ఆ ప్రకటనను ఏమాత్రం పట్టించుకోకుండా అడ్మిషన్లు చేస్తూ నగరంలో వివిధ సంస్థలకు సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. నారాయణ, చైతన్య కార్పొరేట్ విద్యా సంస్థలు పర్మిషన్ లేకపోయినా ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి చేశారన్నారు.

ఈ నెలలో చేసుకుంటే ఒక ఫీజు, జూన్ మాసంలో చేసుకుంటే ఒక ఫీజ్ అని తల్లితండ్రులకు మాయమాటలు చెప్పి కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు ఇప్పటికే కొన్ని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పూర్తి అయినాయని బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పేపర్ ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యారు తప్ప ఎక్కడ ప్రత్యక్షంగా సందర్శించింది లేదన్నారు. డీఈవో, ఆర్ఐవో తక్షణమే కార్పొరేట్ విద్యాసంస్థలను సందర్శించి ఏవైతే అడ్మిషన్లు చేస్తున్నారో వాటిపైన చర్యలు తీసుకొని సీజ్ చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్ష కార్యదర్శులు షేక్ షాహిద్, వినోద్ జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ, నగర నాయకులు హరికృష్ణ, వంశీ, కిరణ్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ వీసీగా దళితుడిని నియమించాలి

విశాలాంధ్ర - పాములపాడు : దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ విసీగా ప్రభుత్వం నియమించాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కలబండి అంకన్న కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ వందేళ్ల చరిత్రలో ఇంతవరకు దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి విసీగా పదవి దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పుడు యూనివర్సిటీ వీసీ పదవి కాలం ముగియనుండడంతో రాష్ట్ర ప్రభుత్వము నూతన వీసీల నియామక ప్రక్రియను చేపట్టిందని, వీసీ పదవి దళిత సామాజిక వర్గానికి అందని ద్రాక్షగా మారిందన్నారు.

డయల్ యువర్ డీఎం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల కేంద్రంలో ఆదివారం డిపో మేనేజర్ తిరుపతయ్య విలేకరుల సమావేశం తో మాట్లాడుతూ ప్రజా రవాణా సమస్యలపై మంగళ వారం ఉదయం 11 నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించదమైనది. కొయిలకుంట్ల డిపో పరిధి లో ఏవైనా సమస్యలు , ఫిర్యాదు లను సెల్ నెంబర్ 9959225798కు తెలియజేయ వలసినదిగా కోరదమైనది. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రయాణీకులు సద్వినియొగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిలైట్ స్మారక దినోత్సవం

విశాలాంధ్ర -ఆత్మకూరు రూరల్ : మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య ఆధ్వర్యంలో మేరీబా స్వచ్ఛంద సంస్థ వాళ్ళు హెచ్ఐవీ ఎయిడ్స్ ద్వారా చనిపోయిన వారి ఆత్మ శాంతి కోసం ప్రతి ఏడాది మే నెల మూడో ఆదివారం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరీబా స్వచ్ఛంద సంస్థ మేనేజర్ మాలిఫిక ఆలీకా, ఎస్ శంకర్ రెడ్డి ఆత్మకూరు పట్టణ ఏఎస్ఐ, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, సంపూర్ణ సురక్ష మేనేజర్ ఇస్మాయిల్, జబివుల్లా, ప్రకాష్, మేరీబా సిబ్బంది రాజు, అజ్మతుల్లా, నరసమ్మ, ఈశ్వరమ్మ, సంజమ్మ, హబీబుల్లా, క్రాంతి, అరుణ కుమారి, అరుణ, భారతమ్మ, గౌసియా పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆరెంపీ మృతి

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ లింగారెడ్డి (50) గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఐదు రోజుల కిందట లింగారెడ్డి ఇంటి వద్ద గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. అంకిరెడ్డిపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాలలో ఆయన వైద్య సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందారు. లింగారెడ్డి మృతి పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు. లింగారెడ్డి మృతదేహాన్ని స్థాపన కోసం అతని స్వగ్రామమైన అనంతపురం జిల్లా ఆత్మకూరుకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం.. తడిసిన సిమెంట్ బస్తాలు

విశాలాంధ్ర -రుద్రవరం : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు - నేడు పనులు నిలిచి పోయాయి. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా నాడు నేడు పనులకు ఉపయోగించే సిమెంట్ బస్తాలు తడిసి గడ్డకట్టాయి. మండలంలోని యల్లావత్తుల గ్రామంలోని దళిత కాలనీలో ఉన్న ఐఅస్పెషల్ పాఠశాలలో చేపట్టిన నాడు నేడు పనులు నిలిచి పోయాయి. నాడు నేడు పనులకు సరఫరా చేసిన సిమెంట్ బస్తాలు వర్షం వలిపిరి కొట్టడంతో తడిసిపోయాయి. పాఠశాలకు సెలవు కావడంతో సిమెంటు బస్తాలను జాగ్రత్తగా ఉండాల్సిన ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా బస్తాలు వర్షం ఒలిపిరికి తడిసి పోవడంతో ప్రభుత్వ నిధులు వృధా అయ్యాయని గ్రామస్తులు తెలిపారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శం

విశాలాంధ్ర- బనగానపల్లె: మండలం పరిధి లోని పలుకూరు గ్రామంలో స్థానిక రామాలయం నందు బ్రహ్మంగారి భక్త బృందం సహకారంతో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానందచారి ఆధ్వర్యంలో బ్రహ్మంగారి కాలజ్ఞానం విశిష్టత, భక్తి భావన పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది. మొదట బ్రహ్మంగారి చిత్రపటానికి పూజలు నిర్వహించిన అనంతరం బ్రహ్మానంద చారి మాట్లాడుతూ భూత భవిష్యత్తు వర్తమానం తెలియజేసిన దేవాది దేవుడు బ్రహ్మంగారిని తన కాలజ్ఞానం ద్వారా అనేక విషయాలు తెలియజేయడం జరిగినదని అవి జరగడం చాలా సంతోషమని అలాగే బనగానపల్లెలోని రవ్వల కొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని చింతామణి మఠం, నేలమట్టం బ్రహ్మంగారి దేవాలయాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి భక్త బృందం అధ్యక్షుడు టీవీ కొండలరావు, సెక్రటరీ రాజు, ఆలయ పూజారి శ్రీనివాసులు, భజన మండలి అధ్యక్షుడు కేతు యాంకర్ సుబ్బయ్య గౌడు, బాల హనుమంతు, సుబ్బారెడ్డి ,బ్రహ్మంగారి భక్త బృందం పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర- నందికొట్కూరు: వర్షాకాలం మొదలైనందున నంద్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నందికొట్కూరు పట్టణ ప్రజలు సీజన్ వ్యాధుల నుండి అరికట్టేందుకు గత రెండు రోజుల నుండి మున్సిపల్ సిబ్బంది అప్రమత్తం చేయడం జరిగిందని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీ అన్ని వార్డులలో జీఎల్ఆర్ఎస్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచేందుకు వేగవంతంగా సిబ్బందితో ట్యాంకులను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. కోటా వీధిలో ఉన్న జీఎల్ఆర్ఎస్ ట్యాంకులను మున్సిపల్ కార్మికులు బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.

యాగంటి క్షేత్రంలో జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర- బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వర స్వామిని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి కుటుంబ సమేతం గా దర్శించుకున్నారు. ఆలయ ఈవో బి.చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక పూజ అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రారెడ్డి ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన సిద్ధార్థ రెడ్డి

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణంలోని ఎన్ఎస్ ఫంక్షన్ హాల్ నందు పట్టణానికి చెందిన రైతు సంఘం నాయకులు బాబు కుమారుడు షబ్బీర్ వివాహానికి ఆదివారం ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, ఉపాధ్యక్షులు చింత విజ్జి, ఉపేంద్ర రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, మాజీ ఆప్షన్ సభ్యులు జబ్బర్, ఉమ్మడి జిల్లా మైనార్టీ జోనల్ ఇన్చార్జి అబూబకర్, కౌన్సిలర్లు చినరాజు, లాలూ ప్రసాద్, రావు ఫ్, ఉస్మాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 20, మే 2024

ఇసుక తరలింపులో నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు

విశాలాంధ్ర - ఆదోని: సుప్రీంకోర్టు, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఇసుక ర్యాంపులో లోడింగ్ చేసిన, ఇసుక లారీలు తరలించినా చట్ట ప్రకారం జరిమానా, కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ సృజన అన్నారు. ఆదోని డివిజన్ కౌతళం మండలంలోని గుడికంబళి, మరళి గ్రామంలో ఇసుక ర్యాంపులను నది తీరంలో అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ఇసుక ర్యాంపులో నిల్వ ఉన్న ఇసుక వివరాల గురించి మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్‌ని అరా తీశారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ప్రదేశం, సమయంలోనే ఇసుకను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా లారీలో ఇసుకను అధికంగా తరలించకూడదని, తరలిస్తే సంబంధిత లారీలపై చర్యలు తీసుకొని జరిమానా విధిస్తామని తెలిపారు. అంతే కాకుండా చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడానికి ఆదేశాలు ఉన్నాయని హెచ్చరిం చారు. ఇసుక రిచ్ కేంద్రాలలో సీసీ కెమెరా లను ఏర్పాటు చేయాలని ముఖ్యంగా లారీలు, టిప్పర్లు, జేసీబీలు వెళ్ళే దారిలో సీసీ కెమెరాలు పక్కాగా ఉండేటట్లు ఏర్పాటు చేసి నిరంతరం మానిటరింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధన లకు విరుద్ధంగా ఉన్న వాటిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సైలేశ్వర్, కౌతాళం తహశీల్దారు అలెగ్జాండర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శశిర దీప్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమాలు

- కౌంటింగ్‌పై ఎన్నికల కమిషన్ సూచనలను క్షుణ్ణంగా చదవాలి
- జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఈ నెల 24, 31వ తేదీల్లో కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఢిల్లీ నుండి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు అన్ని రాష్ట్రాల ఆర్వోలకు కౌంటింగ్ కు సంబంధించిన డౌట్ క్లియరింగ్ సెషన్స్ నిర్వహణలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆర్వోలకు క్లియరింగ్ సెషన్స్ నిర్వహించారు. ఈ సెషన్స్ లో జిల్లాకు చెందిన కలెక్టర్‌తో పాటు ఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు. సెషన్స్ అనంతరం కలెక్టర్ ఆర్వోలు, ఏఆర్వో లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డౌట్ క్లియరింగ్ సెషన్స్ లో నిర్దేశించిన విధంగా 17సీ, పీవో డైరీ, 17ఏ తదితర డాక్యుమెంట్లు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఎక్సెల్ షీట్ లో తనకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కంపెండియం ఆఫ్ ఇన్స్ట్రక్షన్స్, ఈసిఐ నుండి ఈ నెల 20,24 వ తేదీల్లో వచ్చిన ఇన్స్ట్రక్షన్స్, ఆర్వో హాండ్ బుక్, అబ్జర్వర్ హ్యాండ్ బుక్ లో ఉండే కౌంటింగ్ కు సంబంధించిన సూచనలను ఆర్వో లు, ఏఆర్వోలు క్షుణ్ణంగా చదవాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ఆర్వో స్థాయిలో కూడా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, టేబులేషన్ విధులు నిర్వహించే సిబ్బందితో డౌట్ క్లియరింగ్ సెషన్స్ నిర్వహించుకోవాలన్నారు.. 22వ తేదీన పొలిటికల్ పార్టీ లతో సమావేశం నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ అంశాలపై తాను కూడా ఆర్వోలతో సమావేశం నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఈనెల 24వ తేదీన కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత, 31వ తేదీన రెండో విడత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణా కార్యక్రమాల్లో కౌంటింగ్ సిబ్బందితోపాటు ఆర్వోలు, ఏఆర్వోలు, డిప్యూటీ తహసీల్దారులు, టేబులేషన్ విధులను కేటాయించిన సిబ్బంది, స్పెషల్ ఆఫీసర్లు కూడా పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాలు వస్తున్నందున స్ట్రాంగ్ రూముల లోపలికి నీరు పోకుండా వాటర్ ప్రూఫింగ్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్వోలను ఆదేశించారు. ఆర్వోలందరితో ఈ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. టెలికాన్ఫరెన్స్ పాణ్యం ఆర్ఓ, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్ఓ, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, ఇతర నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్ఓలు, స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను పరిశీలించిన కలెక్టర్ సృజన

విశాలాంధ్ర - కౌతాళం రూరల్ : మండల పరిధిలోని తుంగభద్రా నది పరివాహక ప్రాంతం గుడి కంబాళి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన ఇసుక రీచ్‌ను జిల్లా కలెక్టర్ సృజన పరిశీలించారు. శనివారం ఉదయం ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఇరిగేషన్ అధికారులు, కోస్గి సీఐ ప్రసాద్, కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ఇసుక రీచ్ వద్ద చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. కర్ణాటక ప్రాంతం అధికారులు తమ భూభాగంలో ఇసుకను తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో పరిస్థితిని పరిశీలించడానికి కలెక్టర్ వచ్చినట్లు సమాచారం. తుంగభద్రా నదిలో తమ భూభాగాన్ని పరిశీలిస్తే ఎలాంటి ఆక్రమణ జరగలేదని వాస్తవం వెల్లడైనట్లు తెలిపారు.

సిమెంటు బస్తాలు అందజేసిన ధరణిధర రెడ్డి

విశాలాంధ్ర - కౌతాళం రూరల్ : మంత్రాలయం నియోజకవర్గం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి తనయుడు ధరణి రెడ్డి చర్చి నిర్మాణానికి 300 బస్తాలు సిమెంట్ అందించారు. మండల పరిధిలోని పొదలకుంట మధిర గ్రామంలోని చర్చి నిర్మాణానికి సిమెంటు అవసరం ఉందని ధరణి రెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకుపోయారు. ధరణి రెడ్డి తనవంతుగా 300 బస్తాలను శనివారం గ్రామానికి పంపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్యే కుటుంబం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారని, ఇందుకు నిదర్శనమే చర్చి నిర్మాణానికి 300 సిమెంట్ బస్తాలను అందించడం జరిగిందన్నారు. అందుకోసమే నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేకు ఎమ్మెల్యే కుటుంబానికి గత 15 ఏళ్లగా అభిమానాన్ని ఓటు రూపంలో చాటుకుంటున్నారని గ్రామస్తులు రామయ్య పలాక్షి, చాగి చంద్రయ్య, కత్తి గోవిందప్ప బాలయ్య, హరిజన నగేష్, కట్టప్ప ఆనందం వ్యక్తం చేశారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పత్తికొండ: రైతు సోదరులు రాయితీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024- 25 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. రాయితీ వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు విత్తన రిజిస్ట్రేషన్ ఈనెల 20వ తేదీ నుండి 25వ తేదీ లోపల చేసుకోవాలన్నారు. 30 కేజీల వేరుశనగ బ్యాగ్ రాయితీ ధర రూ.1710, 60 కేజీల బ్యాగ్ రూ.3420, 90 కేజీల బ్యాగ్ రూ.5130 చెల్లించాలన్నారు. అప్లికేషన్ ఫామ్‌తో పాటు, ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకురావాలన్నారు. నల్లరేగడి భూములకు వేరుశనగ విత్తనాలు ఇవ్వబడవని తెలిపారు.

తాత్కాలిక ఫీజు చెల్లింపుకు అవకాశం

విశాలాంధ్ర- కర్నూలు ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ తాత్కాలిక సప్లమెంటరీ పరీక్ష ఫీజు సోమవారం 10 గంటలకు నుండి సాయంత్రం 5 గంటల లోపల పరీక్ష ఫీజుచెల్లించాలని ఆర్ఐవో గురువయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక సప్లమెంటరీ ఫీజు రూ.3 వేలతో చెల్లించాలని తెలిపారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా కట్టాలని, ఫీజు కట్టని విద్యార్థులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

శాంతి భద్రతలకు విఘాథం కల్పిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-పత్తికొండ: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు ముగిసిన దృష్ట్యా గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ మురళీమోహన్ తెలిపారు. ఆదివారం మండలంలోని హొసూర్ గ్రామంలో అర్బన్ సీఐ మురళీమోహన్, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డిలు, పత్తికొండ రూరల్ ఎస్సై, తుగ్గలి, జొన్నగిరి,మద్దికేర ఎస్సైలతో కలిసి నిర్బంధ తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో 5 లీటర్ల నాటుసారా, 24 కర్ణాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర గ్రామస్తుల తో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎటువంటి అల్లర్లకు పాల్పడకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలు పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోండి

విశాలాంధ్ర -గోనెగండ్ల : మండలంలో ఖరీఫ్ విత్తనాల కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి హేమలత పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. మండలానికి 275 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మాంజూరైనట్లు తెలిపారు. రాయితీ కింద క్వింటా వేరుశనగ విత్తనాలకు రూ.5700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 20 నుంచి ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తప్పక పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో షఫీ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

విశాలాంధ్ర -ఆస్పరి : మండల కేంద్రంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలను స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సీపీఎం సీనియర్ నాయకులు మాణిక్యప్ప సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన మహానుభావుడు, తెలుగు జాతి ముద్దుబిడ్డ, మహనీయులు, పీడిత ప్రజల ఆశాజ్యోతి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. సీపీఎం మండల నాయకులు రామాంజనేయులు, మసాలా రవి, మహేష్, కాశన్న, ఆటో యూనియన్ నాయకులు బలరాం, రమేష్, సతీష్, పులి పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల కేంద్రంలో ఆదివారం డిపో మేనేజర్ తిరుప తయ్య విలేకరుల సమావేశం తో మాట్లాడుతూ ప్రజా రవాణా సమస్యలపై మంగళ వారం ఉదయం 11 నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించదమైనది. కొయిలకుంట్ల డిపో పరిధి లో ఏవైనా సమస్యలు , ఫిర్యాదు లను సెల్ నెంబర్ 9959225798కు తెలియజేయ వలసినదిగా కోరదమైనది. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రయాణీకులు సద్వినియొగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

శ్రీ మారెమ్మవ్వ దేవాలయంలో హెూమం

విశాలాంధ్ర - పెద్ద కడబూరు : మండల కేంద్రంలో వెలసిన శ్రీ మారెమ్మ అవ్వ దేవాలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహెూత్సవాలు ఆదివారం గ్రామ పెద్దలు రామలింగారెడ్డి, కరణం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అవ్వ వారి విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మధ్య హెూమం నిర్వహించారు. దేవాలయంలో ఇటీవల నూతన విగ్రహాలను ఏర్పాటు చేయడంతో వాటి ప్రాణ ప్రతిష్ట కోసం మూడ్రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు.

అనుమానస్పద స్థితిలో ముగ్గురు మహిళలు మృతి

- గార్గేపురం చెరువులో ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యం
- దర్గా సమీపంలో ఒక మహిళా శవం ఆచూకీ
- తెలంగాణ ప్రాంత మహిళలుగా అనుమానం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన పలువురు ఉన్నతాధికారులు
- నేరస్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదంటున్న పోలీస్ అధికారులు

విశాలాంధ్ర -కల్లూరు: నగర సమీపంలోని గార్గేపురం పరిసర ప్రాంతాల్లో అనుమాదాస్పద స్థితిలో ముగ్గురు మహిళలు మృతి చెందిన సంఘటన జిల్లాలో చోటుచేసుకుంది. ఈ మేరకు ఆదివారం ఉదయం కర్నూలు రూరల్ మండలం గార్గేపురం సమీపంలోని దర్గా దగ్గర ఒక మహిళ శవం చుట్టుపక్కల వారికి కనిపించగా పక్కనే ఉన్న చెరువులో ఇద్దరు మహిళల శవాలు నీటిలో తేలియాడుతూ అక్కడికి వెళ్లిన ప్రజలకు కనిపించడంతో సంబంధిత అధికారులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ స్థానిక పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకొని చెరువులో తేలియాడుతున్న ఇద్దరు మహిళల శవాలను గజ ఈతగాళ్ల సహాయంతో బయటికి తీసి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. దర్గా సమీపంలో అనుమానాస్పదకంగా పడి ఉన్న మహిళా శవాన్ని ప్రత్యేక డాగ్ క్లూస్ టీంతో పరిశీలించి అక్కడ దొరికిన ఆనవాళ్లను భద్రపరిచి మహిళా శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి అధికారులు తరలించారు. ముగ్గురు మహిళలు మృతి చెంది విగత జీవులుగాపడి ఉండడంతో పలు రకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులు పేర్కొంటు న్నారు. మహిళల మృతదేహాలను చూసేందుకు రహదారిపై వెళ్లే వాహనదారులు ప్రయాణికులు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీ ఎత్తున చేరుకోవడంతో రహదారిపై రాకపోకలు భారీగా నిలిచి పోయాయి. ఈ విషయాన్ని గమనించిన పోలీసు అధికారులు ప్రత్యేక టీంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా అనవసరమైన ప్రజలు సంఘటన స్థలం దగ్గర ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఐజీ విజయమోహన్ మాట్లాడుతూ మహిళలు తెలంగాణ వాసులుగా గుర్తించామని, పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు వెల్లడించారు. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారమే కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మహిళల మృతికి కారకులను ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్, అడిషనల్ ఎస్పీ నాగరాజు, డీఎస్పీ కారణం విజయ శేఖర్, సీఐ శ్రీధర్ రెవెన్యూ అధికారులు మహానంది, మాధవకృష్ణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా విద్యార్థులు

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : ఈ నెల 26వ తేదీ హిందూపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు బద్రి చెస్ అకాడమీ చీఫ్ కోచ్ కె.బద్రి తెలిపారు. ఆదివారం బుధవారపేట కేశవ మెమోరి స్కూల్ జిల్లా స్థాయి ఓపెన్ చదరంగం నిర్వహించారు. ఈ పోటీలలో బాలరు విభాగంలో మొత్తం 6 రౌండ్లు గాను 5 1/2 గెలిచి, ఎస్ఎల్ఎన్ ఉధృవ్ ప్రథమ, బహుమతి కైవసం చేసుకోగా బాలికలు విభాగంలో 5 రౌండ్లగాను 5 గెలిచి కె.సమన్విత మొదటి బహుమతి కైవసం చేసుకున్నట్లు బద్రి చెస్ అకాడమీ చీఫ్ కోచ్ చెప్పారు. బాలుర, బాలికల విభాగంలో ఈ ఇద్దరు రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు సెలెక్ట్ కావడం ఆనందంగా ఉందని కోచ్ కె.బద్రి ఆనందం వ్యక్తపరిచాడు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చల పల్లి సుంద రయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు అధ్యక్షులు వి.నాగమోహన్, జిల్లా ఆవాజ్ నాయకులు మహ్మద్ రఫీ, సీఐటీయూ కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు, నాయకులు వెంకటయ్య, కిషోర్, రహంతుల్లా, కృష్ణ, మోదీ, పెద్ద వలి, జాషువా, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఆణిముత్యం నీలం సంజీవరెడ్డి : కె.బాబురావు

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ : రాయలసీమ రాజకీయ ఆణిముత్యం నీలం సంజీవరెడ్డి అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు అభిప్రాయపడ్డారు. ఆదివారం స్వర్గీయ నీలం సంజీవరెడ్డి 111వ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాబు రావు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత అనంతపురం జిల్లాలో జన్మించిన నీలం సంజీవరెడ్డి భారత ఆరవ రాష్ట్రపతిగా, ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా, లోక్ సభ స్పీకర్ గా పనిచేశారని నేటి రాజకీయాలలో ఒకసారి ఎమ్మెల్యే అయితే కోట్లకు పడగలు ఎత్తుతూ రాజకీయ వారసత్వాన్ని పోషిస్తున్న తరుణంలో హంగు, ఆర్భాటాలు లేని నిస్వార్ధ సేవలు అందించిన ప్రజా నాయకుడు నీలం సంజీవరెడ్డి అన్నారు. ముందుగా పార్టీ కార్యాలయంలో నీలం సంజీవరెడ్డి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, డీసీసీ గౌరవా ధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ పీజీ నరసింహులు యాదవ్, జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: సమాజంలో పేదలను ఆదుకునే బాధ్యత కేవలం ప్రభుత్వాలదే అన్న ఆలోచనలు వదలివేసి సామాజిక స్పృహతో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ అన్నారు. నగరంలోని గాయత్రి ఎస్టేట్ శ్రీ గురుదత్త పాలి క్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో పేద మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొంత లాభాన్ని కొంతమానుకొని పొరుగు వారికి సేవ చేయాలనే దృక్పథంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమాజంలో పేదలను ఆదుకోవడం కేవలం ప్రభుత్వాల బాధ్యత గానే చాలామంది భావిస్తున్నారని కానీ అలా కాకుండా సామాజిక సేవ దృక్పథంతో తమవంతుగా పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగానే తాను పేదల కోసం తనకున్న పరిధిలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని వివరించారు. సమాజంలో ఎంతోమంది ధనికులు ఉన్నారని, వారంతా పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని వారికి సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ మానవత సేవా దృక్పథంతో ముందుకు వస్తే సమాజంలో పేదరికం తగ్గించేందుకు అవకాశం ఉందని ఆయన వివరించారు .ప్రస్తుతం సమాజంలో విద్య, వైద్యంతో పాటు ఎంతోమంది సరైన ఆహారం దొరకక ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని ఆర్థికంగా ఉన్నవారు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. పేదలందరికీ కూడు, గుడ్డ వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఎన్జీవో సంఘాలు కృషి చేస్తున్నాయని సేవాభావం ఉన్నవాళ్లు అందులో భాగస్వాములు కావలసిన అవసరం ఉందన్నారు.

ఘనంగా సుందరయ్య, ఈకే నాయనర్ వర్ధంతి

విశాలాంధ్ర- వెల్దుర్తి: పట్టణ కేంద్రంలో మోటార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ మండల అధ్యక్షులు రాజు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య, ఈకే నాయనర్, వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు వై.నగేష్ మాట్లాడుతూ 1913 మే 1వ తేదీ నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలం అలగానపాడు గ్రామంలో సుందరయ్య జన్మించారు. మే 19 1985వ సంవత్సరంలో మరణించారు అని తెలిపారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి ఈ కే నయనర్ 1919లో జన్మించి 2004 మే 19న మరణించారని తెలిపారు. సుందరయ్య తన జీవితం మొత్తం పేదల కోసం కార్మికుల కోసం కష్టజీవుల కోసం నిస్వార్ధంతో పోరాటం చేసిన వ్యక్తి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించి సాయుధ పోరాటంలో 10 లక్షల ఎకరాలు పైచిలుకు భూములను నిజాం ప్రభుత్వాన్ని ఓడించి ప్రజలకు దక్కేలా చేశారని తెలిపారు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం ఏర్పడాలని ఆకాంక్షించిన వ్యక్తి మొట్టమొదటి పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడుగా పనిచేసి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) మొదటి కార్యదర్శిగా ఎన్నికయ్యారు అని తెలిపారు. సుందరయ్య ఆదర్శంగా తీసుకొని నిస్వార్థంతో రాజకీయాలు చేయాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది అని తెలిపారు. ఇలాంటి తరుణంలో కార్మికులు కష్టజీవులు యువతీ యువకులు ఐక్యంగా సంఘటితమై కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, కామ్రేడ్ ఈకే నాయణర్ వారసత్వాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటరాముడు, మహేష్, నాగరాజు, శీను, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో రైతులకు సాగునీరు అందేనా...!

విశాలాంధ్ర - చిప్పగిరి: ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందక రైతులు సాగు చేసిన పంటలు చేతికి అందక అప్పుల ఊబిలో కూరుకు పోతున్న అన్నదాతలకు ఉపాధి హామీ పథకం ఒక వరం లాంటిదని రైతులు తెలియ జేస్తున్నారు. మండల పరిధిలోని ఆలూరు బ్రాంచ్ కెనాల్ నుండి మండల పరిధిలోని బంటనహాలు, చిప్పగిరి, ఏరూరు, డేగుల హాల్, బెల్డోన, తిమ్మాపురం, నగరడోన, రామదుర్గం గ్రామాలతో పాటు హాల హర్వి మండల పరిధిలోని మల్లికార్జున పల్లి, సిరిగా పురం, అర్ధగేరి గ్రామాల రైతులకు సాగు, తాగు నీరు అందించాల్సి ఉంది. అయితే ఇరిగేషన్ అధికారుల అలసత్వం వల్ల చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందక రైతులు సాగు చేసిన పంటలు చేతికి అందక అప్పుల ఊబిలో కూలిపోతున్న రైతన్నలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్‌నందు కంప చెట్లతోపాటు, పూడిక పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు రావడం లేదని, ఐదవ డిస్ట్రిబ్యూటర్ వరకు మాత్రం సాగు నీరు అందుతున్నప్పటికీ చివరి ఆయకట్టు రైతులు సాగు చేసిన పంటలకు మాత్రం పుష్కలంగా సాగు నీరు అందకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు దిగుబడి రాకపోవడంతో అప్పులు ఊబిలో కోరుకుపోతున్నామని రైతన్నలు వాపోతున్నారు. అయితే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కూలీలకు ఉపాధి కల్పిస్తూ ఆలూరు బ్రాంచ్ కెనాల్ నందు పూడిక తీసివేయడంతో అన్నదాత జీవితాలలో ఆశలు చిగురించాయని కెనాల్ నందు పూడిక తీసివేయడం వల్ల చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందని ఆశతో రైతన్నలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వచ్చే సీజన్‌లోనైనా ఆలూరు బ్రాంచ్ కెనాల్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ రైతన్నలను దృష్టిలో ఉంచుకొని ఆలూరు బ్రాంచ్ కెనాల్‌లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి పనులు చేపట్టడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నదాతలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ కు సరైన సమయంలో సాగునీరు విడుదల చేస్తే రైతులు సాగు చేసిన పంటలు చేతికి అందుతాయని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ ఇరిగేషన్ అధికారులు రైతులను దృష్టిలో ఉంచుకొని చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇరిగేషన్ అధికారులకు అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దేవుడి దయతో, ధైర్యంగా పాములను పడతా...

విశాలాంధ్ర-కోసిగి: నరసింహ సినిమాలో ఓ సన్నివేశంలో నాగుపామును రజనీకాంత్ పుట్టలో వెళ్లిన పామును చేతితో పట్టుకుని ముద్దాడి వదిలేస్తాడు. అప్పుడు కమెడియన్ ఏమండీ పామును చేతి లో పట్టుకున్నారు అది కరవలేదా అండి అంటూ ప్రతి సన్నివేశంలో అడుగుతుంటాడు చివరకు రజనీ కాంత్ పాము కరిచిన ఈ ఒంటికి విషం ఎక్కదు అంటూ సమాధానం ఇస్తాడు. అయితే సినిమాలో ఓ సన్నివేశం నిజజీవితంలో కోసిగి గ్రామంలోని మూడో వార్డు పరసానిగేనికి చెందిన అనంతగేని తాయన్న శంకరమ్మ కుమారుడైన సర్పారెడ్డి నిజ జీవితంలో గ్రామంలో పాము కనిపించినా ఇట్టే వాలి పోయి అక్కడున్న పామును చాకచక్యంగా పట్టుకుని కొండల్లో, నీళ్ల ఉన్న ప్రాంతాల్లో వదిలేస్తాడు. పాముకు ఎలాంటి హానితల పెట్టడు. పాము ఎక్కడైనా కనబడితే భయపడకుండా పామును చంపకుండా తనకు సమాచారం ఇస్తే సురక్షిత ప్రాంతాలకు వది లేస్తానని చెబుతాడు. ఆది వారం కోసిగి దొర మురళి కృష్ణ రాజు ఇంట్లో బుసలు కొట్టు కుంటూ నాగు పాము వచ్చింది. వెంటనే సర్పారెడ్డికి సమాచారం ఇచ్చిన పది నిమిషాల్లోనే అక్కడికి చేరు కొని బుసలు కొడుతున్న నాగుపామును అలా చేతితో పట్టుకొని మైదానంలో పది నిమిషాలు బాగా దాంతో ఆడించి ఓ డబ్బాలో తీసుకెళ్లి ఊరి బయట వదిలే యడం జరిగింది. తన దగ్గర ఎటువంటి మాయ మంత్రాలు లేవని చెట్టు వంటివి తనకు తెలియదని కేవలం దేవుడి దయ ధైర్యంతో పాములను పడతా నన్నాడు. ఎవరైనా సరే పామును కనిపిస్తే వాటిని చంపరాదని ప్రజలకు తెలియ జేస్తాడు. ఏ చిన్న పాము కనిపించినా తనకు సమాచారం ఇస్తే పామును పట్టి అడవుల్లో వదిలేస్తా నన్నాడు. ఈ వారంలో గ్రామంలో నాలుగు పాములను పట్టడం జరిగిందని తెలిపాడు.